సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 02 | సంచిక : 73 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శుక్రవారం | 04.07.2025

## మరిపెడలో ఘోర ప్రమాదం

- దగ్ధమైన రెండు లారీలు
- ముగ్గురు సజీవ దహనం



**మహబూబాబాద్, మన చౌరాస్తా :** మహబూబాబాద్ జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు లారీలు ఢీకొని మంటలు చెలరేగడంతో ముగ్గురు సజీవ దహనం అయ్యారు. ఈ ఘటన వివరాలు స్థానికు కథనం ప్రకారం.. జిల్లాలోని మరిపెడ మండలం కుడియాతండా సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున రెండు లారీలు ఢీకొన్నాయి. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో లారీలు పూర్తిగా దగ్ధమయ్యాయి. అందులో ఉన్న ఇద్దరు డ్రైవర్లు, క్లీనర్ సజీవదహనమయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపుచేసేలోపే రెండు లారీలు పూర్తిగా కాలిపోయాయి ప్రమాదానికి ప్రమాదానికి గురైన లారీల్లో ఒకటి విజయవాడ నుంచి గుజరాత్ వెళ్తుండగా, మరోలారి వరంగల్ నుంచి ఆంధ్ర వైపు వెళ్తున్నట్టు స్థానికులు తెలిపారు.  ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి.







## విద్యాశాఖపై కలెక్టర్ స్పెషల్ ఫోకస్

- పాఠశాలకు సంబంధించిన అన్ని అంశాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి
- ఉన్నతమైన విద్యా ప్రమాణాలు, పౌష్టికాహారం అందించడమే లక్ష్యం
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

3 లో

## పేదల సొంతింటి కల సాకారం చేస్తున్నాం

- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి
- ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ



3 లో

# ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి



**లింగాలఘణపురం, మన చౌరాస్తా :** జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా గురువారం లింగాల ఘణపురం మండలంలో పర్యటించి ఇంకుడు గుంతలు, , ఫెస్టిలైజర్ షాపు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను తనిఖీ చేశారు. ఇంకుడు గుంతలను నిర్మాణాన్ని పరిశీలించి ప్రతి ఒక్కరూ నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూగర్భ జలాలను పరిరక్షించుకునేందుకు ఇంకుడు గుంతల నిర్మాణాలు అవసరమన్నారు. ఫెస్టిలైజర్ షాప్ ను తనిఖీ చేశారు. ధరల పట్టికను ప్రదర్శించాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను విక్రయించేటప్పుడు రిజిస్టర్ లో ఊరు, పేరు, సెల్ నెంబర్లను నమోదు చేయాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం బండ్ల గూడెంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్దిదారులతో మాట్లాడారు. ఇంటి నిర్మాణానికి అయిన ఖర్చును ఆడిగి తెలుసుకున్నారు. ఏ సామాగ్రికి ఎంత ఖర్చు చేస్తున్నారని లబ్దిదారుల నుండి తెలుసుకుంటూ ఖర్చు తగ్గించుకుంటూ ఇంటి నిర్మాణం చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రవీందర్, అధికారులు ఉన్నారు.







## 'ఉగ్రప్రభా' క్రమంలో శ్రీ భద్రకాళి

**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్ శ్రీ భద్రకాళి దేవస్థానంలో శాకాంబరీ నవరాత్ర మహోత్సవాలు గురువారంతో 8వ రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమాల్లో భాగంగా అమ్మవారిని కాళీక్రమాన్ని అనుసరించి ఉగ్ర ప్రభా, షోడశీ క్రమాన్ని అనుసరించి త్వరితామాత గా ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అలంకరించి, పూజారాదనలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో కే శేషు భారతి, ఉద్యోగులు, ఆలయ ధర్మకర్తలు తగు ఏర్పాట్లు చేశారు.

## ఘనంగా పీఎన్ఆర్ జన్మదిన వేడుకలు

**బచ్చనపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేట మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు పోచంపల్లి నాగరాజు (పీఎన్ఆర్ ) జన్మదిన వేడుకలు మండల యూత్ కాంగ్రెస్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజుచే కేక్ కట్ చేయించి ఆయనను శాలువాలతో సన్మానించారు. ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ప్రజాక్షేత్రంలో ఉండి ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని నాయకులు ఆకాంక్షించారు.





## పేదల కళ్లల్లో ఆనందం నింపిన ప్రభుత్వం

### ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

**చేర్యాల, మన చౌరాస్తా :** ఎన్నో సంవత్సరాలుగా గూడు కోసం ఎదురుచూస్తున్న ప్రాంత ప్రజలకు ప్రభుత్వం ఇండ్లు ఇచ్చి వారి కళ్లల్లో ఆనందం నింపిందని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హైమావతి, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి అన్నారు. చేర్యాల పట్టణంలోని కళ్యాణి గార్డెన్ లో గురువారం చేర్యాల కొమురవెల్లి మద్దూరు దూలిమిట్ట మండలాలకు చెందిన అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ అధికారిక కార్యక్రమం జరగగా ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి పేదవారి కళ్ళల్లో ఆనందం చూడడానికి ఎంత దూరమైనా వెళ్తారని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పేదవారి సొంత ఇంటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం ముందుకు వెళుతుందని ఈ కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందని అన్నారు. జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇండ్ల నిర్మాణ కార్యక్రమం పూర్తి చేయాలని అన్నారు. జనగామ డిసిసి అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాల కాలంలో ఏ ఒక్కరికి ఇండ్లు రాలేదని అర్హులైన పేదవారికి ఇండ్లు ఇస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మార్కెట్ చైర్మన్, డైరెక్టర్లు పీఏసీఎస్ ప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### చేర్యాల డివిజన్ కోసం వినతి

చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలని కోరుతూ రెవెన్యూ డివిజన్ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ స్పందిస్తూ రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రాంత ప్రజలు ఎవరు ఇబ్బందులు పడవద్దని రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని త్వరలోనే ఈ ప్రాంత ప్రజలు శుభవార్త వింటారని అన్నారు. అనంతరం జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగళ్ళ పరమేశ్వర్ మాట్లాడుతూ అనివార్యమైనటువంటి చేర్యాల డివిజన్ ఏర్పాటు విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పుర్మా ఆగం రెడ్డి, అందె అశోక్, అందె బీరయ్య, బుట్టి సత్యనారాయణ, సనవాల ప్రసాద్, అందె నాని బాబు, రామడుగు బాలరాజు, జంగిలి యాదగిరి, సుందరగిరి భాస్కర్, పోలోజు వెంకటాద్రి, కరెడ్ల రఘుపతి రెడ్డి, ఈరి భూమయ్య, కుడిక్యాల బాల మోహన్, కత్తుల భాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# పేదల కలలు సాకారం చేస్తున్నాం..

- భువనగిరి ఎంపీ చామల

**జనగామ, మన చౌరాస్తా :** నిరుపేదల సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సాయి రామ్ ఫంక్షన్ హాల్ ల్లో ఆర్డీఓ ఆధ్వర్యంలో జరిగిన జనగామ నియోజక వర్గస్థాయి సమావేశంలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్‌తో కలిసి పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని జనగామ మున్సిపాలిటీ, జనగామ, బచ్చన్నపేట, నర్మెట్ట, తరిగొప్పుల మండలాలలో అర్హులైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు 816 మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వడమే ధ్యేయంగా పెట్టుకున్నట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని గ్రామాలలో భూభారతి సదస్సులు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించి సమస్యలు పరిష్కారం చేస్తున్నామన్నారు. కొత్త రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టబోతున్నామని, సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టి నిరుపేదలను ఆదుకున్నామన్నారు. 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, 500 రూ.లకే వంట గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం వంటి ప్రభుత్వ పథకాలను నిరంతరంగా కొనసాగిస్తున్నారు. వ్యవసాయం పండుగలా చేపట్టేందుకు రైతన్నకు పెద్ద పీట వేశామన్నారు. లబ్దిదారులు ఇందిరమ్మ ఇండ్లు త్వరగా నిర్మించుకుంటే అధికారులు, ప్రజాప్రతినిధులుతో స్వయంగా ఇంటికి వచ్చి ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్.టి.ఏ. సభ్యుడు అభి గౌడ్, ఆర్డీఓ గోపిరామ్, హౌసింగ్ పీడీ మాతృ నాయక్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, జనగామ నియోజకవర్గ స్థాయి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.





# విజయోస్తు 2.0 షురూ

- పక్కాగా కార్యాచరణ
- పాఠశాలకు సంబంధించిన అన్ని అంశాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి
- విద్యాశాఖ మీద కలెక్టర్ ప్రత్యేక దృష్టి
- ఉన్నతమైన విద్యా ప్రమాణాలు, పౌష్టికాహారం అందించడమే లక్ష్యం
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలో విద్యాశాఖపై కలెక్టర్ రిజ్వాన్ బాషా ప్రత్యేక దృష్టి పెట్టారు. 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో బడిబాట నమోదు, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్ పంపిణీ, అకాడమిక్ క్యాలెండర్, పదో తరగతి అయిపోయిన విద్యార్థులు ఇంటర్మీడియట్ లో చేరడం, ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్ష లకై ముందస్తు కార్యాచరణ తదితర అంశాలపై అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, డీఈవో భోజన్నలతో కలిసి ఎంఈవో, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి భవిష్యత్ ఉపాధ్యాయుల మీద ఆధార పడి ఉన్నదన్నారు. విద్యార్థులు ప్రతీ రోజూ పాఠశాలకు వచ్చేలా మనిటరింగ్ చేసి, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. టీచర్ల అటెండెన్స్ కి సంబంధించి ప్రతీ రోజూ నివేదిక సమర్పించాలన్నారు. అత్యవసరం ఉంటేనే టీచర్లు లీవ్ పెట్టాలని, పాఠ్యంశాల బోధనకి ఇబ్బంది కలగకుండా లీవ్ మేనేజ్మెంట్ చేసుకోవాలన్నారు. మధ్యాహ్నభోజనం మీద ప్రత్యేక దృష్టి పెట్టాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని స్పష్టం చేశారు. అలాగే ఏ విద్యార్థి సీజనల్ వ్యాధులు బారిన పడకుండా శానిటేషన్ పక్కాగా ఉండాలని, ప్రతీ స్కూల్ పరిశుభ్రంగా ఉండాలన్నారు. కొత్తగా అడ్మిషన్ గా తీసుకున్న విద్యార్థులు ముందు బెంచ్‌లో కూర్చునేలా చేయాలని, ఏబీసీ క్యాటగిరి ని పాటించాలన్నారు. పదవ తరగతి విద్యార్థి ఇంటర్మీడియట్ లో చేరేలా మానిటారింగ్ చేయాలన్నారు. జులై 10వ తేదీ లోపు ఏ విద్యార్థి ఏ కాలేజ్ లో జాయిన్ అయ్యారో.. దానికి సంబంధించిన నివేదిక ఇవ్వాలన్నారు. అలాగే పదవ తరగతి పరీక్షల కోసం ముందస్తు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. పాఠశాల స్థాయి నుంచే కేరిర్ గైడన్స్ ఉండాలని, బాలబాలికలు క్రీడల్లో చురుకుగా పాల్గొనేలా ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. ప్రతీ పాఠశాల లలో కనీసం మూడు ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగం గా అన్ని పాఠశాలల్లో మొక్కలను నాటాలన్నారు. నషా ముక్త భారత్‌లో భాగంగా హైస్కూల్ విద్యార్థుల మీద ఫోకస్ పెట్టాలన్నారు. వారి బ్యాగ్ లను ఎప్పటికప్పుడు చెక్ చేయాలన్నారు. మండల వారిగా మ్యాపింగ్ చేసుకుని అవసరం ఉన్న వాళ్లను హాస్టల్లో జాయిన్ చేయించాలన్నారు. అంగన్‌వాడీ పాఠశాలలో బోధన తీరు మెరుగు పడాలన్నారు. సమావేశంలో వివిధ విభాగల కోఆర్డినేటర్లు, అన్ని పాఠశాలలు, కేజీవిబీ, మాడల్ స్కూల్ హెడ్ మాస్టర్లు పాల్గొన్నారు.




# విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

**జనగామ, మన చౌరాస్తా :** విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పాఠశాల స్థాయి నుంచే అలవరచుకోవాలని నారాయణ విద్యాసంస్థల వరంగల్ డీజీఎం రిజ్వాన అన్నారు. గురువారం జనగామ నారాయణ పాఠశాలలో 'క్యాబినెట్ ఇన్ స్టలేషన్' ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనగామ జిల్లా సబ్ జైలర్ పి.కృష్ణ కాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత లు పాఠశాల స్థాయి నుంచి నేర్చుకోవాలన్నారు . పాఠశాల ప్రిన్సిపాల్ ఫర్హానా మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల మార్చ్ ఫాస్ట్, విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రీజనల్ కోఆర్డినేటర్ శ్రీనివాసచారి, హైస్కూల్ కోఆర్డినేటర్ సాయి కృష్ణ, అకాడమిక్ డీన్ విక్రమ్, ఏవో చారి, అన్వర్, ఇమ్రాన్, వైస్ ప్రిన్సిపాల్ రేణుక, ఈ కిడ్స్ ఇంచార్జ్ శ్రీలేఖ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



# పరిశుభ్రతపై యాక్షన్ ప్లాన్

## అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్

జనగామ, మన చౌరాస్తా : జనగామ మున్సిపాలిటీలో పరిశుభ్రత కొరకు వందరోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టినట్లు అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తెలిపారు. గురువారం సంబంధిత అధికారులతో యాక్షన్ ప్లాన్ పై సమీక్షించారు. జూన్ 2 నుండి 100 రోజుల ప్రణాళిక అమలు పరుస్తున్నామని సెప్టెంబర్ 10వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. మున్సిపాలిటీలో 30 వార్డ్ లు ఉన్నాయి. ప్రతి వార్డులలో పనులు ప్రణాళిక బద్ధంగా చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించారు. ఇప్పటివరకు చేపట్టిన పనులను మున్సిపల్ అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా పింకేష్ కుమార్ మాట్లాడుతూ పరిశుభ్రత పనులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అదేవిధంగా చేపడుతున్న పనులను కూడా ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. వర్షాలు కురుస్తున్న క్రమంలో లోతట్టు ప్రాంతాలపై ప్రధానంగా దృష్టి పెట్టామని, ముందుగా నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయిస్తున్నామన్నారు. సాయి నగర్, శివాలయం వీధి, కుర్మవాడ, అంబేద్కర్ నగర్, గిర్ని గడ్డ, సంజయ్ నగర్, రెడ్డి స్ట్రీట్, గీతా నగర్, వీవర్స్ కాలనీ లలో కాలువలను శుభ్ర పరిచామన్నారు. మురికి కాలువలలో ఆయిల్ బాల్స్ వేయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రోజువారీగా తడి, పొడి చెత్త సేకరణ పై ఫోకస్ పెట్టామన్నారు. ఇంటింటికి చెత్త సేకరణ చేపడుతూ, చెత్త చెదారం రోడ్లపై వేస్తే చర్యలు తీసుకుంటున్నామన్నారు. మొదటి సారిగా వేస్తే 2 వేలు, 2వ సారి చెత్త వేస్తే 5వేలు జరిమానా విధిస్తున్నామన్నారు. కూరగాయల మార్కెట్, మాంసపు దుకాణాల వద్ద వ్యర్ధాలను తొలగింప చేస్తూ బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తూ అశ్రద్ధ చేయరాదని అధికారులకు సూచించామన్నారు. ప్రజల సహకారంతో ముందుకు పోతూ స్వచ్ఛత దిశగా జనగామ మున్సిపాలిటీ ని క్లీన్ టౌన్ గా అందమైన పట్టణంగా తీర్చిదిద్దుతామన్నారు.






# హక్కుల కోసం పోరాడే తల్లి పాత్రే..మైసా



ప్రస్తుతం ఇండస్ట్రీలో వరుస హిట్లతో దూసుకెళ్తున్న స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న 'యానిమల్', 'పుష్ప 2', 'ఛావా' ఇలా బ్లాక్ బస్టర్ హిట్లతో సూపర్ క్రేజ్ సంపాదించుకున్నారు. ఇక ఆమె తాజాగా నటించబోతున్న లేడీ ఓరియెంటెడ్ చిత్రం 'మైసా. ఈ ప్రాజెక్టు నుంచి రష్మిక ఫస్ట్ లుక్ విడుదలైనప్పటి నుంచే సోషల్ మీడియాలో విపరీతమైన హైప్ క్రియేట్ అవుతుంది. ఇప్పటి వరకు ఎన్నడూ లేని విధంగా రక్తంతో ముఖం, చేతిలో ఆయుధం, ముక్కుపుడకతో ఆమె లుక్ చూసి అంతా షాక్ అయ్యారు. 'ధైర్యం ఆమె బలం..ఆమె గర్జన వినడానికి కాదు.. భయపెట్టడానికి..' అంటూ ఇచ్చిన హైప్ గూస్ బంప్స్ తెప్పిస్తోంది. ఇక..'మైసా' అనే టైటిల్ అనౌన్స్ చేయగానే అందరిలోనూ ఓ ఆసక్తి నెలకొంది. అసలు మైసా అంటే ఏంటనే ప్రశ్నలు మొదలు అయ్యాయి.

రష్మిక లుక్‌కు ఈ పేరుకు సంబంధం ఏంటి? అంటూ సోషల్ మీడియాలో పెద్ద చర్చే సాగింది. అయితే 'మైసా' అనే పదం వివిధ భాషల మూలాల నుంచి తీసుకున్నారు. స్వీడిష్, అరబిక్, జపనీస్, జార్జియన్ భాషల్లో 'మైసా' అనే పదానికి 'తల్లి' అని అర్థం. స్వేచ్ఛా భావాలతో, సహజ నాయకత్వంలో ముందుకు సాగిన ఓ సాహసవంతురాలి పాత్రకు ఇది సరైన టైటిల్ అని మేకర్స్ చెబుతున్నారు. ఈ సినిమాలో రష్మిక వారియర్ మదర్ కనిపించనున్నారు. గోండు తెగల పటిష్ఠమైన సామాజిక నేపథ్యం ఆధారంగా ఈ కథ సాగనుంది. ఈ తెగల హక్కుల కోసం పోరాడే ఓ తల్లిగా, నాయకురాలిగా రష్మిక పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని సమాచారం. ఆమె పాత్రలో ఉన్న తీవ్రత, ఎమోషన్‌ను ఫస్ట్ లుక్ స్పష్టంగా అర్థమవుతుంది.




## పులిని వేటాడే
# బెబ్బులి

### అదిరిపోయేలా హరిహరవీరమల్లు ట్రైలర్

పవన్ ఫాన్స్‌కు పండగే పండగ. హరిహర వీరమల్లు థియేట్రికల్ ట్రైలర్ రిలీజ్ చేశారు. దాదాపు మూడు నిమిషాల నిడివితో వచ్చిన ఈ ట్రైలర్ పవన్ ఫ్యాన్స్‌కు ఫుల్ మీల్స్ పట్టేలా.. విజువల్ ట్రీట్ ఇచ్చేలా ఉంది. మేకర్స్ ముందు నుంచి చెబుతున్నట్టుగా.. అద్భుతమైన విజువల్స్‌తో హరిహర వీరమల్లు ట్రైలర్ అదిరి పోయింది. మూడే మూడు డైలాగ్స్‌తో సినిమా కథను చెప్పేశారు. హిందువుగా జీవించాలంటే పన్ను కట్టాల్సిన సమయం, ఈ దేశ శ్రమ బాద్‌షా పాదాల కింద నలిగిపోతున్న సమయం, ఒక వీరుడు కోసం ప్రకృతి పురుడు పోసుకుంటున్న సమయం.. అంటూ మొఘలులను ఎదురించిన వీరుని కథే హరిహర వీరమల్లు కథ అని చెప్పేశారు. కోహినూర్ డైమండ్ అంటూ పవన్‌కి ఇచ్చిన ఎలివేషన్ పీక్స్ అనే చెప్పాలి. పవర్ స్టార్ చెప్పిన డైలాగ్స్ బాగున్నాయి. పులిని వేటాడే బెబ్బులిని చూస్తారు అంటూ.. పవన్ చెప్పిన డైలాగ్ విజిల్స్ వేసేలా ఉంది. అలాగే.. మన దేశ ప్రధాని మోదీ పవన్ గురించి చెప్పిన 'యే పవన్ నహీ ఆంధీ హై' డైలాగ్‌ను ట్రైలర్‌లో హైలెట్ చేశారు. విలన్ బాబీ డియోల్ చేత.. ఆంధీ వచ్చేసింది అంటూ ఎలివేషన్ ఇచ్చారు. ఔరంగజేబు పాత్రలో బాబీ డియోల్‌ను పవర్ ఫుల్‌గా చూపించారు. ఇక పవన్ లుక్, యాక్షన్, విజువల్ పరంగా ట్రైలర్ అదరహో అనేలా ఉంది. కాకపోతే.. కొన్ని ఫ్రేమ్స్‌లో సీజీ వర్క్ పై ఇంకాస్త దృష్టి పెట్టాల్సింది. కానీ పీరియాడికల్ సెటప్ మాత్రం అదిరిపోయింది. నిర్మాత ఏఎం. రత్నం పెట్టిన బడ్జెట్ ప్రతి ఫ్రేమ్‌లో కనిపిస్తోంది. హీరోయిన్ నిధి అగర్వాల్‌కు మంచి పాత్ర పడినట్టుగా ఉంది. ఆస్కార్ విన్నర్ ఎంఎం. కీరవాణి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ బాగుంది. మొత్తంగా.. పవన్ ఫ్యాన్స్‌ను మెప్పించేలా ఉంది ఈ ట్రైలర్. ఇక్కడితో సినిమా పై అంచనాలు మరింతగా పెరిగిపోయాయి. వీరమల్లు విధ్వంసం ఎలా ఉంటుందో చూడ్డానికి ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు అభిమానులు. మరి హరిహర వీరమల్లు ఎలా ఉంటుందో తెలియాలంటే.. జులై 24 వరకు వెయిట్ చేయాల్సిందే.